# మృగతృష్ణ

"టెలిగ్రాం" అనే కేక విని పరుగెత్తుకెళ్ళి తలుపుతీశాను.

చాలా చీకటి పడిపోయింది. ఇంట్లో ఏదో ఆలోచనలతో కూర్చున్న నేను ఇంత టైం అయిపోయిందని అనుకోలేదు.

కరంటు కోతవల్ల వెలగని వీధి దీపాలు, అన్ని అర్హతలూ ఉన్నా, నిరుద్యోగిగా ఉన్నందువల్ల తల్లిదండ్రులకు వెలుగులందించలేని నాలాగే కనిపించాయి.

నాకు టెలిగ్రాం పంపే దెవరా అని ఆశ్చర్యంతో చూశాను. సంతకం పెట్టి టెలిగ్రాం తీసుకున్నాను.

కొన ఊపిరితో వెలుగుతున్న హరికెన్ లాంప్ వెలుగులో టెలిగ్రాం చదివాను. మరోసారి చదివాను. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. నేను చదువుతున్నది నిజమేనా?

వెంటనే డ్యూటీలో చేరమని ఉందా టెలిగ్రామ్‌లో!

నేను పుట్టినప్పటినుంచి విద్యుద్దీపాలు వెలగని మా ఇల్లు విద్యు-ద్దీపాలతో కళకళలాడుతున్నట్లు తోచింది.

మరోసారి చదివేను. నేను తప్పు చదువలేదు.

"వెంటనే డ్యూటీలో చేరండి."

టెలిగ్రాం పంపిన వారి చిరునామా చూశాను. ఏదో ఢిల్లీ కంపెనీ. గుర్తు తెచ్చుకుందామని ఎంత ప్రయత్నించినా ఆ కంపెనీకి ఇంటర్వ్యూకి వెళ్ళినట్లు నాకు గుర్తురాలేదు. బహుశా, వెళ్ళే ఉంటానేమో! లేకపోతే ఈ విశాల భారతదేశంలో ఉన్న శతకోటి నిరుద్యోగులలో నన్ను గుర్తించుకుని నాకే టెలిగ్రాం పంపటం ఎందుకు?

నా నెత్తిమీద వెంట్రుకలెన్నీ, అంటే ఠక్కున చెప్పగలనేమోగాని, ఎన్ని ఇంటర్వ్యూలకి వెళ్ళావంటే చెప్పటం కష్టం. అన్ని ఇంటర్వ్యూ కార్డులు జిరాక్స్ చేసి జాగ్రత్తగా ఫైల్ చేసి ఉంచాను కొట్టుగదిలో.

లాంతరు తిసుకొని వెళ్ళి కొట్టు తలుపులు తీశాను. అతిథి

అడుగు పెట్టాడని చెప్పాలని కాబోలు, నేలపై ఆడుతున్న బొద్దింకలు నన్ను చూసి పరుగెత్తాయి. నన్ను చూసిన దోమలు ఆప్యాయంగానూ, ఆనందంగానూ ఇస్లాం పద్ధతిలో నన్ను ఒంటికి హత్తుకుని స్వాగతం పలికేయి.

సర్ది పెట్టిన ఫైల్స్ ఒకటి తర్వాత ఒకటి విప్పి చూశాను. కావల్సిన కాగితం దొరకలేదు. ఏమయివుంటుంది.

హఠాత్తుగా గుర్తుకొచ్చింది. ఇంటర్వ్యూ కాగితం ఫైల్ చేయలేదేమో? ప్రతీ కాగితమూ జిరాక్స్ చెయ్యమని మా నాన్నగారు రెండు రూపాయలిస్తారు కానీ నాలో ఓ వీక్‌నెస్ ఉంది. లాట్రీ టికెట్ అంటే మక్కువ. అందుకే అప్పుడప్పుడు జిరాక్స్ తీయించకుండా లాట్రీ టికెట్ కొంటూ ఉంటాను. ఉద్యోగానికన్నా, లాట్రీ పలకటానికే అవకాశం ఎక్కువ.

గడియారం ఎనిమిది సార్లు మ్రోగింది. అమ్మ, నాన్నగారు ఇంకా ఇంటికి రాలేదు. రాత్రి బండికి బయలుదేరకపోతే లాభం లేదు. నాన్నగారు రావాలి డబ్బులివ్వాలి.

ఓ నిమిషం ఆలోచించాను. నాన్నగారు రావటం ఆలస్యమైతే... నాన్నగారైనా డబ్బుగురించి వెళ్ళేది రాయుడిగారి దగ్గరకేగా.

నేనే బయలుదేరాను.

రాయుడుగారు మాకు రిజర్వ్ బేంకే. నేను ఇంటర్వ్యూ కెళ్ళినప్పుడల్లా నాన్నగారు అతని దగ్గరనుంచే డబ్బు తెస్తారు.

గబగబా నడిచాను. మా వీధిలో దీపాలులేవుగానీ, రాయుడిగారి వీధి, ఇల్లూ కూడా దీపాలతో కళకళలాడుతున్నాయి.

"ఏమోయ్ పంతులూ, మళ్ళీ ఏదైనా ఇంటర్వ్యూ వచ్చిందా?" నన్ను చూసిన రాయుడుగారు వెంటనే అడిగేరు.

"ఈసారి ఇంటర్వ్యూ కాదండి. ఉద్యోగమే వచ్చింది."

"ఉద్యోగమే!" రాయుడిగారి గొంతులో ఆశ్చర్యం ధ్వనించింది.

"ఔనండి. ఉద్యోగంలో చేరమని టెలిగ్రాం వచ్చింది."

"ఐతే ఈసారి పెద్ద మొత్తమే అడుగుతావన్న మాట. ఇంతకీ ఉద్యోగం ఏ ఊరిలో?"

"ఢిల్లీలోనండి"

"ఢిల్లీలోనే? జీతమెంతా?"

"తెలీదండి"

రాయుడుగారు లోపలికెళ్ళారు ఆరువందలు తీసుకొచ్చి ఇచ్చారు.

"తీసుకో పంతులూ," రాయుడుగారు అన్నారు. "బాకీ పెరిగిపో-తోందని బాధపడకు, ఓ ఆరు నెలలు ఉద్యోగం రాలేదనుకో అదే తీరిపోతుంది."

ఇంటికి వచ్చేసరికి నాన్నగారు, అమ్మ వచ్చేశారు. టెలిగ్రాం సంగతి చెప్పాను. "ఏమోరా నాకు నమ్మకం కుదరడంలేదు. ఈ టెలిగ్రాం నీకేనంటావా?"

మరోసారి టెలిగ్రాం చూశాను. నాపేరే! మా అడ్రస్సే! మా ఇంటి నంబరే! రాత్రి బండికి బయలుదేరాను. ఢిల్లీ చేరుకున్నాను ఫేక్టరీ గేటు దగ్గర బస్సు ఆగింది. బస్సు దిగిన నా గుండెలు గబగబా కొట్టుకున్నాయి. ఎంత పెద్ద ఫేక్టరీ! ఎన్ని పొగగొట్టాలు.

ఎదురుగా గేటు దగ్గర నించున్న సాయుధ రక్షక భటులు యమ-కింకరుల్లా కనిపించారు. నా చేతిలోని టెలిగ్రాం వాళ్ళకి చూపాను. ఒకరి మొహాలొకరు చూసుకుని ఏవేవో నన్ను హిందీలో అడిగేరు. నాకర్థం కాలేదు.

రెండు హిందీ ముక్కలు కూడా రానివాడు ఉద్యోగం ఏం చేస్తా-డన్నట్లు హేళనగా చూసారు వాళ్ళు.

"రిసెప్షన్ రిసెప్షన్" అతికష్టం మీద పలికేడు ఒకడు. దారి చూపుతున్నట్లు, వేలు అటు చూపాడు.

రిసెప్షనిస్టు టెలిగ్రాం చూసి కూర్చోమన్నాడు. నా ఎదుట కని-పించిన గడియారం ముళ్ళు కదులుతూనే ఉన్నాయి. నాగురించి ఎవరూ పట్టించుకోలేదు.

నాకు ఆకలేసింది, దాహం కూడాను. మంచినీళ్ళన్నా త్రాగితే బాగుంటుందని లేచాను.

రెండడుగులు వేసి ఆగిపోయాను. ఎదురుగా నడిచివస్తున్నాడు శర్మ. అ మరోసారి చూశాను అవును శర్మ!

శర్మది మా అగ్రహారమే! చిన్నప్పటినుంచి కలిసి ఆడుకున్నాం, చదువుకున్నాం. వాడు ప్రతి భాశాలి కనుక మెట్రిక్ తో చదువు ఆపేశాడు. స్టెనోగ్రాఫీ నేర్చుకున్నాడు. ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నా-డని తెలుసుగానీ ఇక్కడే పని చేస్తున్నాడని అనుకోలేదు. హడావిడిగా బయలుదేరటంవల్ల వాడి చిరునామా తీసుకోలేకపోయానే అని బాధ-పడుతూనే ఉన్నాను.

వాడు నన్ను చూసినట్లే ఉన్నాడు. తిన్నగా నా దగ్గరకే వచ్చాడు. "నువ్వేంటిరా ఇక్కడ" వాడి కళ్ళు ఆశ్చర్యం తోనూ, ఆనందం-తోనూ వెలిగాయి. అంతా విన్న శర్మ మొహం క్వశ్చన్ మార్కులా మారిపోయింది.

"అదేంటిరా. అలా మొహం పెట్టావు?"

"ఏం లేదురా నీకు టెలిగ్రాం వచ్చిందంటే నమ్మలేకపోతున్నాను."

"ఎందుకని?"

"ఫేక్టరీ పది రోజులనుంచీ స్ట్రైక్ లో వుందిరా. ఇప్పుడు కొత్త-వాళ్ళని తీసుకుంటారా అని..."

టెలిగ్రామ్ తీసి ఇచ్చాను.

"రా నా గదిలో కూర్చుందువుగాని."

నన్ను అతని గదిలో కూర్చోబెట్టి టెలిగ్రాం తీసుకుని వెళ్ళాడు శర్మ.

నేను రంగు వెలసిపోయి శూన్యంగా కనిపిస్తున్న గోడలను చూస్తూ కూర్చున్నాను.

"టెలిగ్రాం ఎవరు పంపారో తెలీటంలేదురా" గదిలోనికి వస్తూ అన్నాడు శర్మ.

"కొంత టైంపడుతుంది ఏ సంగతీ తెలియటానికి." నేను మాట్లాడలేదు. శర్మ ఏవేవో మాట్లాడుతున్నాడు. ఊరి విశేషాలు అడుగుతున్నాడు.

ఫోను మ్రోగింది. శర్మ ఏదో మాట్లాడాడు.

"నిన్ను పిలుస్తున్నారురా" ఫోనుపెట్టేసి శర్మ అన్నాడు. పద. శర్మ నన్ను రెండో అంతస్తుకు తీసుకొని వెళ్ళాడు. ఓ గది చూపించి లోపల కెళ్ళమన్నాడు.

తలుపు మెల్లగా తెరిచాను. చల్లనిగాలి మొహానికి తగిలింది. 'లోపలికి రండి' కుర్చీలో కూర్చున్న అతను ఆహ్వానించాడు. కూర్చోమన్నాడు.

"మేము చాలా చింతిస్తున్నాం" అతను అన్నాడు. "ఈ టెలిగ్రాం మీకు పంపలేదు."

నేనుగోడల మీద ఖరీదైన వర్ణచిత్రాలు చూస్తూ కూర్చున్నాను. ఖరీదైన కార్పెట్ కాళ్ళకు తగులుతోంది.

"మీకు ఇబ్బంది కలిగించినందుకు చింతిస్తున్నాం" అతను మళ్లీ అన్నాడు. ప్యూన్ ట్రేలో కూల్ డ్రింక్స్ తీసుకొని వచ్చాడు.

"తీసుకోండి"

నా మనస్సుని ముంచుకొస్తున్న బాధని, నిస్సహాయత్వాన్ని కూల్-డ్రింక్ తో చల్లబరచాలనుకుంటున్నాడు కాబోలు అతను.

ఏసి గదిలో కూర్చున్న వాళ్ళకి కూల్ డ్రింక్స్! ఎండలో మాడి-పోతున్నవాళ్ళకి మంచినీరు కరువు!

"ఇక్కడ పని చేసేవాళ్ళకి ఊరెళ్ళటానికి ప్రతీ సంవత్సరం డబ్బులిస్తారురా" బయటికి రాగానే శర్మ అన్నాడు "ఊరు వెళ్ళినా వెళ్ళకపోయినా ఫరవాలేదు. స్వంత ఊరి చిరునామా ఒకటి ఇవ్వాలి అంతే. సెలవు చీటి మీద కూడా ఆ చిరునామా వ్రాయాలి."

"నాకిదంతా ఎందుకు?" నాకు చిరాకేసింది.

"అందులోనే వుందిరా చిట్కా. ఫేక్టరీలో నీ పేరుతోనే, మన ఊరి వాడొకడున్నాడు. అతను ప్రస్తుతం సెలవులో వున్నాడు."

"అయితే"

"అతను సెలవు పెట్టి వెళ్ళిన తర్వాతే సమ్మె మొదలైంది. డ్యూటీలో చేరమని అతనికి టెలిగ్రాం ఇచ్చారుట."

"ఇస్తే..."

"అదే నీకందిన టెలిగ్రాం."

"అతని టెలిగ్రాం నా కందటం లేదేమిటి."

"అదే విచిత్రం. ఆంధ్రదేశంలో ఇప్పుడు అతనికి ఎవ్వరూ లేరుట. ఎప్పుడో ముప్పై ఏళ్ళక్రితం మన ఊళ్ళో ఉండేవాడుట. మీ ఇంటి నెంబరు అతనికి గుర్తుండి పోయింది" అన్నా చెప్పకు పోయాడు.

"నీ పేరు అతని పేరు ఒకటే గదా? అతను ఢిల్లీలోనే ఉన్నాడు. టెలిగ్రాం నీకందిపోయింది."

నా కళ్ళు బైర్లు కమ్మాయి. నోట మాట రాలేదు. నిరుద్యోగినైన నా మీద విధివేసిన జోకుకి నేను ఏడ్వాలో నవ్వాలో తెలీలేదు.

*(ఉదయం వారపత్రిక 27-7-90 సంచికలో ప్రచురితం).*

* * *